www.prajaprerana.co.in
RNI : APTEL/26/A3850

# ప్రజా ప్రేరణ న్యూస్

prajaprerana.2026@gmail.com
నిజం | నిష్పక్షపాతం | ప్రజా ప్రేరణ








సంపుటి : 01 సంచిక : 34 ప్రకాశం శనివారం 04-07 -2026 ప్రకాశం నుంచి ప్రచురణ పబ్లిసర్ :కుందురు శ్రీనివాసరెడ్డి పేజిలు: 4 వెల : 2/-

Volume : 01 Issue : 34 PRAKASAM 04-07-2026 Publisher : KUNDURU SRINIVASA REDDY Pages :4 Rs : 2/-


## హైవే కనెక్టివిటీకి ఊతం.. మరో రెండు రహదారి ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం



ఏపీ బ్యూరో / జూలై 03, ప్రజా ప్రేరణ :

దేశంలో రవాణా మౌలిక వసతులను మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో రెండు ప్రధాన జాతీయ రహదారి ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. ఢిల్లీలో రూ. 6,970 కోట్ల వ్యయంతో 6 లేన్ల ద్వారకా సొరంగ మార్గం (టన్నెల్) నిర్మాణానికి కేంద్ర కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఢిల్లీలో ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటు విమానాశ్రయం, ద్వారకా ప్రాంతాలకు ప్రయాణ సమయం గణనీయంగా తగ్గనుంది. అలాగే, ఉత్తరప్రదేశ్‌లో కాన్పూర్--కబ్రాయ్ మధ్య రూ. 7,145 కోట్ల అంచనా వ్యయంతో 4 లేన్ల యాక్సెస్ కంట్రోల్డ్ జాతీయ రహదారి నిర్మాణానికీ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ హైవే ద్వారా బుందేల్‌ఖండ్ ప్రాంతానికి మెరుగైన రహదారి అనుసంధానం లభించడంతో పాటు సరుకు రవాణా, పారిశ్రామిక అభివృద్ధికి ఊతం లభించనుంది. ఈ రెండు ప్రాజెక్టులు పూర్తయిన తర్వాత దేశంలో రహదారి కనెక్టివిటీ మరింత మెరుగుపడటంతో పాటు ప్రయాణ సౌకర్యాలు, వాణిజ్య రవాణా వేగవంతం అవుతాయని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. దేశ ఆర్థికాభివృద్ధికి కూడా ఈ ప్రాజెక్టులు దోహదపడతాయని మంత్రివర్గం అభిప్రాయపడింది. 1

## ప్రైవేటుకు 'సంజీవని'.. సర్కారు వైద్యానికి సమాధి?..

వందల కోట్ల ప్రజాధనాన్ని ప్రైవేట్ వ్యవస్థలకు మళ్లిస్తున్నారని విమర్శలు...

కర్ణాటకలో ఆశించిన ఫలితాలు ఇవ్వని నమూనాను ఏపీలో అమలు చేస్తున్నారన్న ఆరోపణలు...

ప్రభుత్వ వైద్య రంగ సంస్కరణలకు బ్రేక్ పడుతుందా అనే ఆందోళన...

ఏపీ బ్యూరో / జులై 03, ప్రజా ప్రేరణ :



రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన సమయం లో, ప్రైవేట్ ఆరోగ్య సేవలకు ప్రాధాన్యత ఇచ్చే విధానాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్న విమర్శలు వ్యక్తమవు తున్నాయి. 'సంజీవని' పేరుతో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త ఆరోగ్య కార్యక్రమంపై రాజకీయ, వైద్య వర్గాల్లో చర్చ సాగుతోంది. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ వైద్య వ్యవస్థను బలోపేతం చేయడం కంటే, ప్రైవేట్ ఆరోగ్య సేవల విస్తరణకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యమంత్రి ఈ కార్యక్రమాన్ని 'గేమ్ చేంజర్'గా అభివర్ణిస్తూ రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు నిర్ణయం తీసుకోగా, ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో కూడా దీనికి ఆమోదం లభించింది. అయితే, ఇదే తరహా కార్యక్రమం గతంలో కర్ణాటకలో ఆశించిన స్థాయిలో ఫలితాలు ఇవ్వలేదని, అలాంటి నమూనాను ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రజలపై ప్రయోగిస్తున్నారని విమర్శకులు ఆరోపిస్తున్నారు. సమాచారం ప్రకారం, ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ సంస్థల భాగస్వామ్యంతో తొలి ఏడాదిలోనే సుమారు రూ. 149 కోట్ల వరకు వ్యయం చేయనున్నట్లు తెలుస్తోంది. అనంతరం ప్రతి ఏడాది రూ. 55.5 కోట్ల మేర ఖర్చు చేయాల్సి ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే ఆర్థిక ఒత్తిళ్లను ఎదుర్కొంటున్న రాష్ట్ర పరిస్థితుల్లో ఇలాంటి భారీ వ్యయ కార్యక్రమాల అవసరంపై ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. వైఎస్సార్‌సీపీ అధినేత, వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో ప్రభుత్వ వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చేందుకు అనేక సంస్కరణలు అమలు చేశారని పార్టీ నాయకులు గుర్తుచేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలను చేరువ చేసేందుకు ఫ్యామిలీ డాక్టర్ విధానం, విలేజ్ క్లినిక్స్, టెలీమెడిసిన్ సేవలు, ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ వ్యవస్థల బలోపేతానికి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు పేర్కొంటున్నారు. ప్రత్యేకించి, ప్రివెంటివ్ కేర్ విధానాలకు పెద్దపీట వేయడం ద్వారా వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందించే వ్యవస్థను గత ప్రభుత్వం ఏర్పాటు చేసిందని వివరిస్తున్నారు. గ్రామ స్థాయిలో వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడం వల్ల పేద, మధ్యతరగతి ప్రజలకు గణనీయమైన ప్రయోజనం చేకూరిందని చెబుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంజీవని కార్యక్రమం వల్ల ప్రభుత్వ వైద్య రంగం మరింత బలహీనపడే ప్రమాదం ఉందని విమర్శకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల మౌలిక సదుపాయాల అభివృద్ధి, వైద్యుల నియామకాలు, పరికరాల సమీకరణ వంటి అంశాలపై దృష్టి సారించాల్సిన సమయంలో, ప్రైవేట్ ఆధారిత నమూనాలపై ఆధారపడటం సరైన విధానం కాదని అభిప్రాయపడుతున్నారు.

# ప్రేమను నటించలేరు.. ఆప్యాయతను దాచలేరు..

వైఎస్ జగన్‌ను చూసి ప్రేమతో చెంపలు గిల్లిన మహిళలు..

హృదయాలను హత్తుకున్న అపురూప దృశ్యం...

అభిమానానికి అద్దం పట్టిన ఆత్మీయ క్షణం..

అనుబంధానికి నిలువెత్తు నిదర్శనంగా మారిన ఘటన...



ఏపీ బ్యూరో / జులై 03, ప్రజా ప్రేరణ :

ప్రేమను నటించడం సాధ్యం కాదు. ఆప్యాయతను దాచిపెట్టడం అంతకంటే సాధ్యం కాదు. హృదయంలో పుట్టిన అనుబంధం, ఆత్మీయత, మమకారం సందర్భం వచ్చినప్పుడు సహజంగానే బయటపడతాయి. రాజకీయ నాయకత్వం పట్ల ప్రజల్లో ఉండే అభిమానం కొన్నిసార్లు మాటలకు అందని భావోద్వేగాలుగా వ్యక్తమవుతుంది. అలాంటి అరుదైన, అపురూపమైన క్షణానికి విజయవాడ వేదికగా నిలిచింది. విజయవాడలో పర్యటించిన సందర్భంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని చూసిన ఇద్దరు మహిళలు చూపించిన ప్రేమాభిమానాలు అక్కడున్న ప్రతి ఒక్కరినీ భావోద్వేగానికి గురిచేశాయి. ఆయనను చూడగానే ఆప్యాయంగా దగ్గరకు వచ్చిన వారు, ప్రేమతో చెంపలు గిల్లుతూ, తలపై చేయి వేసి ఆత్మీయంగా పలకరించారు. ఆ దృశ్యం క్షణాల్లోనే అక్కడి వాతావరణాన్ని భావోద్వేగంతో నింపేసింది. సాధారణంగా ప్రజా ప్రతినిధులను చూసినప్పుడు అభిమానులు నినాదాలు చేస్తారు. చేతులు ఊపుతూ అభివాదం చేస్తారు. అయితే, ఈ సందర్భంలో కనిపించిన ఆప్యాయత మాత్రం రాజకీయ అభిమానాన్ని దాటి, కుటుంబ సభ్యుల మధ్య ఉండే మమకారాన్ని గుర్తుచేసేలా ఉంది. తల్లి తన బిడ్డను ప్రేమగా పలకరించినట్లుగా, అక్కాచెల్లెళ్లు తమ ఇంటి మనిషిని ఆప్యాయంగా పలకరించినట్లుగా కనిపించిన ఆ దృశ్యం అక్కడున్న వారిని కదిలించింది. ఎలాంటి ముందస్తు ప్రణాళిక లేకుండా, ఎలాంటి ప్రదర్శనాత్మకత లేకుండా, హృదయం నుంచి వచ్చిన ప్రేమ మాత్రమే ఆ క్షణంలో కనిపించింది. చెంపలు గిల్లుతూ చూపించిన ఆప్యాయత, తలపై చేయి వేసి ఆశీర్వదించినట్లుగా పలకరించిన తీరు, కళ్లలో కనిపించిన మమకారం అనేక భావోద్వేగాలను ప్రతిబింబించాయి. ప్రజలతో ఏర్పడే అనుబంధం ఎన్నికల సభలతోనో, రాజకీయ ప్రసంగాలతోనో మాత్రమే పరిమితం కాదని, కాలక్రమేణా అది కుటుంబ బంధంలా మారుతుందని ఈ ఘటన మరోసారి స్పష్టం చేసింది. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా నిలిచిన నాయకత్వానికి ప్రతిగా ప్రజలు చూపించే ప్రేమ, ఆప్యాయత ఇలాగే సహజంగా వ్యక్తమవుతుందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ఈ దృశ్యాన్ని చూసిన పలువురు అభిమానులు సామాజిక మాధ్యమాల్లో భావోద్వేగపూరితంగా స్పందిస్తున్నారు. "ఇది కేవలం ఒక పలకరింపు కాదు, ప్రజల హృదయాల్లో ఉన్న స్థానం", "ఇది రాజకీయ అభిమానం కాదు, కుటుంబ అనుబంధం", "ప్రేమను నటించలేరు, ఆప్యాయతను దాచలేరు అనే మాటలకు ఇదే నిదర్శనం" అంటూ వ్యాఖ్యానిస్తున్నారు. రాజకీయ జీవితంలో ఎన్నో సభలు, సమావేశాలు, నిరసనలు, విజయోత్సవాలు చూసినప్పటికీ, ప్రజల హృదయాల నుంచి ఉబికి వచ్చే ఇలాంటి ఆప్యాయతా క్షణాలు మాత్రం ప్రత్యేకంగా నిలిచిపోతాయి. ఎందుకంటే అవి ప్రసంగాలతో సృష్టించినవి కావు. ప్రచారంతో వచ్చినవి కావు. అవి కాలంతో, నమ్మకంతో, అనుబంధంతో నిర్మితమైన భావోద్వేగ బంధాలకు ప్రతిరూపాలు. మాటల్లో పూర్తిగా చెప్పలేని ప్రేమ, వర్ణించలేని మమకారం, హృదయాలను హత్తుకునే ఆప్యా యత, చెరిగిపోని అనుబంధాన్ని ప్రతిబింబించిన ఈ అపురూప దృశ్యం ప్రస్తుతం వేలాది మంది అభిమానులను భావోద్వేగానికి గురిచేస్తోంది. ప్రేమను నటించలేమని, ఆప్యాయతను దాచలేమని మరోసారి నిరూపించిన ఈ సంఘ టన ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోనుంది.

## అమరావతిపై పూటకో మాట మార్చింది చంద్రబాబు, పవన్ కాదా..?

గతంలో చేసిన వ్యాఖ్యల వీడియోలను ప్రదర్శించిన సజ్జల.రామకృష్ణ రెడ్డి...

రాజధాని అంశాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్నారని విమర్శ..

అమరావతి విషయంలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతల,,

పరస్పర విరుద్ధ వ్యాఖ్యలను గుర్తుచేసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ..

ఏపీ బ్యూరో / జులై 03, ప్రజా ప్రేరణ :



అమరావతి రాజధాని అంశంపై తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ తమ రాజకీయ అవసరాలకు అనుగుణంగా పూటకో మాట, రోజుకో వైఖరి మార్చుకున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శించారు. గతంలో వివిధ సందర్భాల్లో చంద్రబాబు, పవన్ కళ్యాణ్, భారతీయ జనతా పార్టీ నాయకులు చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో క్లిప్పింగులను ప్రదర్శిస్తూ, అమరావతి అంశంలో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. అమరావతి విషయంలో ప్రస్తుతం ఒక విధంగా మాట్లాడుతున్న నాయకులు, గతంలో పూర్తిగా భిన్నమైన అభిప్రాయాలను వ్యక్తం చేశారని సజ్జల పేర్కొన్నారు. ఆ వ్యాఖ్యలు ఇప్పుడు ప్రజల ముందుకు రావడంతో వారి ద్వంద్వ వైఖరి బట్టబయలైందని అన్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ గతంలో చేసిన పలు వ్యాఖ్యలను ప్రస్తావించారు. అమరావతిని ఒక సందర్భంలో "టీడీపీ అఫిలియేటెడ్ క్యాపిటల్"గా అభివర్ణించిన పవన్, మరో సందర్భంలో భూసేకరణ ప్రక్రియపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారని గుర్తు చేశారు. రైతులు స్వచ్ఛందంగా భూములు ఇస్తే తీసుకోవాలని, బలవంతంగా భూములను లాక్కోవడం సరికాదని పవన్ స్వయంగా చెప్పిన వీడియోలను ప్రదర్శించారు. అంతేకాకుండా, తన మనసుకు కర్నూలే రాజధాని అని పవన్ ప్రకటించిన సందర్భాలను కూడా గుర్తు చేశారు. ప్రస్తుతం అమరావతి కోసం పోరాటం చేస్తున్నట్లు చెబుతున్న పవన్ కళ్యాణ్, గతంలో చేసిన వ్యాఖ్యలకు ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని సజ్జల ప్రశ్నించారు. రాజకీయ పరిస్థితులు మారినప్పుడల్లా రాజధాని అంశంపై వైఖరిని మార్చుకోవడం ప్రజలను మోసం చేయడమేనని విమర్శించారు. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు గతంలో అమరావతి భవిష్యత్తుపై చేసిన వ్యాఖ్యలను కూడా సజ్జల ప్రస్తావించారు. రాబోయే రోజుల్లో అమరావతి ఒక చిన్న మున్సిపాలిటీగా, ఉత్తమ మున్సిపాలిటీగా రూపు దిద్దుకుంటుందని చంద్రబాబు స్వయంగా చెప్పారని గుర్తు చేశారు. ఇప్పుడు అదే అమరావ తిని ప్రపంచ స్థాయి రాజధానిగా చిత్రీకరిస్తూ రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. భారతీయ జనతా పార్టీ నాయకుల గత ప్రకటనలను కూడా సజ్జల ఉదహరించారు. సోము వీర్రాజు గతంలో మాట్లాడుతూ, చంద్రబాబు అధికారంలో ఉన్న సమయంలో ఒక్క పోర్టు కూడా నిర్మించలేదని, ఎప్పుడూ అమరావతి గురించే మాట్లాడారని విమర్శించిన విషయాన్ని గుర్తు చేశారు. అలాగే జీవీఎల్ నరసింహారావు, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి వికేంద్రీకృత అభివృద్ధి అవసరమని శివరామకృష్ణన్ కమిటీ సూచించిందని స్పష్టంగా చెప్పిన అంశాన్ని ప్రస్తావించారు. అదేవిధంగా పురందేశ్వరి గతంలో చేసిన వ్యాఖ్యలను కూడా సజ్జల గుర్తు చేశారు. తెలుగుదేశం పార్టీ హయాంలో అమరావతి అభివృద్ధి గ్రాఫిక్స్‌కే పరిమితమైందని ఆమె స్వయంగా విమర్శించారని తెలిపారు. ఇప్పుడు అదే అంశంపై భిన్నమైన వైఖరిని అవలంబించడం రాజకీయ అవకాశవాదానికి నిదర్శనమని ఆరోపించారు. అమరావతి పేరుతో రాజకీయాలు చేయడం, ప్రజల భావోద్వేగాలను రెచ్చగొట్టడం, ఎన్నికల అవసరాలకు అనుగుణంగా ప్రకటనలు మార్చడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని సజ్జల వ్యాఖ్యానించారు. గతంలో చేసిన వ్యాఖ్యలు, ప్రస్తుత ప్రకటనలు ప్రజల ముందే ఉన్నాయని, వాటిని చూసి ఎవరు నిజం మాట్లాడుతున్నారో ప్రజలే నిర్ణయిస్తారని అన్నారు. రాజధాని అంశాన్ని రాజకీయ లబ్ధి కోసం కాకుండా రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోణంలో చూడాల్సిన అవసరం ఉందని సజ్జల పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతోనే గతంలో వికేంద్రీకరణకు మద్దతు తెలిపిన నేతలు, ఇప్పుడు రాజకీయ ప్రయోజనాల కోసం తమ వైఖరిని మార్చుకోవడం విచారకరమని అన్నారు.

# రూ.10 వేల హామీ ఏమైంది?..

### జూనియర్ న్యాయవాదులను మోసం చేశారని లీగల్ సెల్ ఆరోపణ...





**ఏపీ బ్యూరో / జులై 03, ప్రజా ప్రేరణ :**

జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.10 వేల స్టైఫండ్ ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని అమలు చేయకుండా ప్రభుత్వం మోసం చేసిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ ఆరోపించింది. గత ప్రభుత్వ హయాంలో అమలైన లా నేస్తం పథకాన్ని కొనసాగించడం లోనూ, ఎన్నికల హామీలను నెరవేర్చడంలోనూ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ విడుదల చేసిన ప్రకటనలో, గతంలో లా నేస్తం పథకం ద్వారా ప్రతి జూనియర్ న్యాయవాదికి నెలకు రూ.5 వేల స్టైఫండ్ అందించారని పేర్కొంది. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో కూడా ఎలాంటి అంతరాయం లేకుండా ఆర్థిక సాయం అందించారని గుర్తు చేసింది.ఎన్నికల సమయంలో నెలకు రూ.5 వేలుగా ఉన్న స్టైఫండ్‌ను రూ.10 వేలకు పెంచి అందిస్తామని హామీ ఇచ్చారని, అయితే అధికారంలోకి వచ్చి దాదాపు రెండేళ్లు పూర్తవుతున్నా ఒక్క జూనియర్ న్యాయవాదికీ ఆ మేరకు సాయం అందలేదని ఆరోపించింది. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా జూనియర్ న్యాయవాదుల ఆశలను ప్రభుత్వం వమ్ము చేసిందని విమర్శించింది.అంతేకాకుండా, జూనియర్ న్యాయవాదులకు ప్రత్యేక శిక్షణ కోసం అకాడమీ ఏర్పాటు చేస్తామని, న్యాయస్థానాల మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తామని, న్యాయవాదుల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకొస్తామని ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చారని పేర్కొంది. అయితే వాటిలో ఒక్క హామీ కూడా అమలుకు నోచుకోలేదని లీగల్ సెల్ ఆరోపించింది. రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది జూనియర్ న్యాయవాదులు ప్రభుత్వ హామీల అమలు కోసం ఎదురుచూస్తున్నారని, ఇచ్చిన మాటలను నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ పేర్కొంది. జూనియర్ న్యాయవాదుల సంక్షేమానికి సంబంధించిన హామీల అమలుపై ప్రభుత్వం వెంటనే స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేసింది.

# నాయి బ్రాహ్మణులకు ప్రత్యేక రక్షణ కల్పించాలి..

### గిద్దలూరులో నాయి బ్రాహ్మణుల నిరసన ర్యాలీ...






**ఏపీ బ్యూరో / జులై 03, ప్రజా ప్రేరణ :**

ప్రకాశం జిల్లా, ఒంగోలులో నాయి బ్రాహ్మణ వృత్తికి చెందిన వ్యక్తి హత్యకు గురైన ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ మార్కాపురం జిల్లా గిద్దలూరు పట్టణంలో నాయి బ్రాహ్మణుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. నాయి బ్రాహ్మణులపై పెరుగుతున్న దాడులను అరికట్టాలని, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు అమలులో ఉన్న రక్షణ చట్టాల తరహాలో నాయి బ్రాహ్మణులకు కూడా ప్రత్యేక రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. నిన్న ప్రకాశం జిల్లా ఒంగోలులోని ఓ క్షౌరశాలలో కమీషన్ పద్ధతిలో పనిచేస్తున్న గుడివాడ మహేందర్ (52)పై రామారావు అనే వ్యక్తి దాడి చేసి హత్య చేసిన ఘటనను తీవ్రంగా ఖండిస్తూ గిద్దలూరులో నాయి బ్రాహ్మణులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సాగిన ఈ ర్యాలీలో పాల్గొన్న వారు నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు.అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్న నాయి బ్రాహ్మణుల సంఘం ప్రతినిధులు తహసీల్దార్ ఎం. ఆంజనేయరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. మహేందర్ హత్యకు కారణమైన నిందితుడిపై కఠిన చర్యలు తీసుకుని, చట్ట ప్రకారం అత్యంత కఠిన శిక్ష విధించాలని వారు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా గిద్దలూరు మండల నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు తొండమల్లు బ్రహ్మయ్య మాట్లాడుతూ, నాయి బ్రాహ్మణులపై జరుగుతున్న దాడులు ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. సమాజానికి సేవలు అందించే వృత్తి వర్గాల భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. నాయి బ్రాహ్మణుల రక్షణ కోసం ప్రత్యేక చట్టపరమైన వ్యవస్థను తీసుకురావాలని, బాధిత కుటుంబాలకు తక్షణ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.నిరసన కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు, సభ్యులు, పెద్ద సంఖ్యలో వృత్తిదారులు పాల్గొన్నారు.

# 'మావిగన్'తోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యం..

**అమరావతి పేరుతో ప్రజలపై లక్షల కోట్ల భారం మోపుతున్నారు...**

**టీడీపీ కూటమి వైఖరిని తప్పుబట్టిన సజ్జల రామకృష్ణ రెడ్డి...**

**అమరావతి, వికేంద్రీకరణపై కూటమి నేతల పాత వీడియోలను ప్రదర్శన...**



**ఏపీ బ్యూరో / జులై 03, ప్రజా ప్రేరణ :**

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రతిపాదించిన మావిగన్ (మచిలీపట్నం--విజయవాడ--గుంటూరు) అభివృద్ధి కారిడార్ రాష్ట్ర సమగ్రాభివృద్ధికి అత్యంత అనువైన నమూనా అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మావిగన్ ప్రతిపాదనకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తుండటంతోనే తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని కూటమి ఆందోళన చెందుతోందని విమర్శించారు.రాష్ట్ర అభివృద్ధి అంటే ఒక ప్రాంతానికే పరిమితమయ్యే విధానం కాదని, అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగిస్తూ అన్ని ప్రాంతాలకు ప్రయోజనం చేకూరే విధంగా ప్రణాళికలు రూపొందించాల్సిన అవసరం ఉందని సజ్జల పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మావిగన్ ప్రతిపాదన రాష్ట్ర భౌగోళిక, ఆర్థిక, పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా రూపొందించబడిన సమగ్ర అభివృద్ధి నమూనా అని వివరించారు.అమరావతి, మావిగన్ మధ్య ఉన్న తేడాలను వైఎస్ జగన్ ఇప్పటికే అనేక సందర్భాల్లో ప్రజలకు వివరించారని సజ్జల తెలిపారు. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న భూములు, ఇప్పటికే అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు, సముద్రపోర్టు, విమానాశ్రయం, జాతీయ రహదారుల అనుసంధానం వంటి అంశాలు మావిగన్ ప్రతిపాదనకు బలమైన పునాదులుగా నిలుస్తాయని చెప్పారు. భారీ స్థాయిలో భూసేకరణ అవసరం లేకుండా, తక్కువ వ్యయంతో, వేగవంతంగా అభివృద్ధి సాధించే అవకాశం మావిగన్ ద్వారా ఉంటుందని పేర్కొన్నారు.అమరావతి నిర్మాణం పేరుతో లక్షల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించడం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై తీవ్రమైన భారం మోపుతుందని సజ్జల ఆరోపించారు. అదే నిధులను రాష్ట్ర ప్రజల అత్యవసర అవసరాల కోసం వినియోగిస్తే మరింత ప్రయోజనం ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలోని పోర్టుల అభివృద్ధి, రాయలసీమ ఎత్తిపోతల పథకాలు, ప్రభుత్వ వైద్య కళాశాలల ఏర్పాటు, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యల పరిష్కారం, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.రాజధాని విషయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి స్థిరత్వం లేదని విమర్శలు చేస్తున్న తెలుగుదేశం పార్టీ, దాని మిత్రపక్షాల నాయకులే గతంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారని సజ్జల గుర్తు చేశారు. ఈ సందర్భంగా అమరావతి, వికేంద్రీకరణ, రాజధాని నిర్మాణం అంశాలపై గతంలో కూటమి నాయకులు చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోలను మీడియా సమావేశంలో ప్రదర్శించారు.జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ గతంలో అమరావతిని తెలుగుదేశం పార్టీ అనుబంధ రాజధానిగా అభివర్ణించారని, భూసేకరణ విధానాన్ని వ్యతిరేకిస్తూ వ్యాఖ్యలు చేశారని, తన అభిప్రాయం ప్రకారం కర్నూలు రాజధానిగా ఉండాలని చెప్పిన సందర్భాలను కూడా గుర్తు చేశారు. అలాగే భారతీయ జనతా పార్టీ నాయకులు గతంలో వికేంద్రీకరణకు మద్దతు పలికిన అంశాలను కూడా ప్రస్తావించారు.కడప ఉక్కు పరిశ్రమ వంటి గత ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన ప్రాజెక్టులను ప్రస్తుతం తమ విజయాలుగా ప్రచారం చేసుకోవడం రాజకీయ క్రెడిట్ దోపిడీకి నిదర్శనమని సజ్జల విమర్శించారు. గతంలో తీసుకున్న నిర్ణయాలను విస్మరించి, ప్రస్తుతం రాజకీయ ప్రయోజనాల కోసం కొత్త కథనాలను సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.అమరావతి పేరుతో ప్రజలపై అప్పుల భారం మోపుతూ రాష్ట్ర ప్రయోజనాలను పక్కనపెడుతున్నారని సజ్జల ఆరోపించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా భారీ వ్యయ ప్రణాళికలను అమలు చేయడం వల్ల భవిష్యత్తు తరాలపై కూడా ఆర్థిక భారం పడే ప్రమాదం ఉందని అన్నారు.అమరావతి ప్రాంతంలో జరుగుతున్న అవినీతి, మట్టి అక్రమాలు, ప్రజాధన దుర్వినియోగంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిరంతరం ప్రశ్నిస్తూనే ఉంటుందని సజ్జల స్పష్టం చేశారు. రైతుల హక్కుల పరిరక్షణ, రాష్ట్ర సమతుల్య అభివృద్ధి, ప్రాంతీయ అసమానతల నివారణ కోసం పార్టీ పోరాటం కొనసాగుతుందని పేర్కొన్నారు.రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ప్రాంతీయ సమతుల్యత, ఆర్థిక బాధ్యత, అందుబాటులో ఉన్న వనరుల సమర్థ వినియోగం అనే మూడు అంశాలే ప్రామాణికంగా ఉండాలని, అదే లక్ష్యంతో మావిగన్ ప్రతిపాదనను వైఎస్ జగన్ ముందుకు తీసుకువచ్చారని సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు.

# చట్టం వ్యాఖ్యను చూస్తుందా? లేక వ్యక్తిని చూస్తుందా?..

**ప్రజాస్వామ్యంలో సమాన న్యాయ అమలుపై పెరుగుతున్న ప్రశ్నలు..**

**వ్యక్తిని బట్టి మారే చర్యలు ప్రజల్లో అపనమ్మకానికి దారితీస్తున్నాయా?..**



**ఏపీ బ్యూరో / జులై 03, ప్రజా ప్రేరణ :**

ఇటీవలి కాలంలో సామాజిక మాధ్యమాలు, డిజిటల్ వేదికలు, వార్తా సంస్థల్లో వ్యక్తమవుతున్న అభిప్రాయాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం తరచుగా కనిపిస్తోంది. యూట్యూబర్లు, జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలు చేసిన వ్యాఖ్యలపై కేసులు నమోదు కావడం, అరెస్టులు జరగడం వంటి పరిణామాలు ప్రజల్లో చర్చనీయాంశంగా మారుతున్నాయి. అదే సమయంలో రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు కూడా అనేక సందర్భాల్లో వ్యక్తిగత విమర్శలు, అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన ఉదాహరణలు ప్రజల ముందే ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రజల మనసుల్లో ఒక కీలకమైన ప్రశ్న తలెత్తుతోంది. చట్టం వ్యాఖ్యను పరిశీలిస్తుందా, లేక ఆ వ్యాఖ్య చేసిన వ్యక్తి ఎవరో చూసి స్పందిస్తుందా?.ప్రజాస్వామ్య వ్యవస్థలో భావ ప్రకటనా స్వేచ్ఛ ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు. అయితే ఆ హక్కు సంపూర్ణమైనది కాదు. పరువు నష్టం, ద్వేష ప్రసంగాలు, హింసను ప్రేరేపించే వ్యాఖ్యలు, సామాజిక విభేదాలను రెచ్చగొట్టే ప్రకటనలు చట్టపరమైన పరిమితులకు లోబడి ఉంటాయి. ఈ నిబంధనలు ఒక సామాన్య పౌరుడికి ఎలా వర్తిస్తాయో, అదే విధంగా రాజకీయ నాయకులకు, ప్రజాప్రతినిధులకు, మీడియా ప్రతినిధులకు కూడా వర్తించాల్సి ఉంటుంది.అయితే ప్రజల్లో పెరుగుతున్న సందేహం చట్టాల ఉనికి గురించి కాదు, వాటి అమలులోని సమానత్వం గురించి. ఒక సాధారణ వ్యక్తి చేసిన వ్యాఖ్యపై వేగంగా చర్యలు తీసుకుంటున్న వ్యవస్థ, అదే స్థాయి లేదా అంతకంటే తీవ్రమైన వ్యాఖ్యలు చేసిన అధికారంలో ఉన్న వ్యక్తుల విషయంలో కూడా అదే వేగం, అదే కఠినతను ప్రదర్శిస్తుందా అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.చట్టం యొక్క అసలు బలం కఠిన శిక్షల్లో ఉండదు. అది సమాన అమలులో ఉంటుంది. ఒకే తరహా వ్యాఖ్యకు ఒకరిపై వెంటనే కేసులు నమోదు కావడం, అరెస్టులు జరగడం, మరొకరిపై ఎలాంటి చర్యలు కనిపించకపోవడం వంటి పరిస్థితులు ప్రజల్లో అనుమానాలకు తావిస్తాయి. అలాంటి సందర్భాల్లో ప్రజలు చట్టవ్యవస్థపై కాకుండా, అధికార వ్యవస్థల పాత్రపై దృష్టి పెట్టడం ప్రారంభిస్తారు. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థలకు దీర్ఘకాలికంగా ప్రమాదకర సంకేతంగా పరిగణించబడుతుంది.మరోవైపు, రాజకీయ నాయకులు, సామాజిక మాధ్యమాల నిర్వాహకులు, యూట్యూబర్లు, మీడియా ప్రతినిధులు సమాజంపై ప్రభావం చూపగల స్థానాల్లో ఉంటారు. అందువల్ల వారి బాధ్యత కూడా అంతే ఎక్కువగా ఉంటుంది. ప్రజాదరణ కోసం, రాజకీయ లబ్ధి కోసం లేదా సంచలనాల కోసం వ్యక్తిగత దూషణలు, అసభ్య పదజాలం, అవమానకర వ్యాఖ్యలను ప్రోత్సహించడం సమాజంలో సంభాషణా ప్రమాణాలను దిగజార్చే ప్రమాదం ఉంది. ప్రజా జీవితంలో ఉన్నవారి మాటలు సమాజంపై ప్రత్యక్ష ప్రభావం చూపుతాయనే విషయాన్ని విస్మరించలేం.ఈ పరిస్థితి ఏ ఒక్క రాజకీయ పార్టీకి పరిమితమైన సమస్య కాదు. అధికారంలోకి వచ్చిన ప్రతి రాజకీయ పార్టీకి ఇదే పరీక్ష ఎదురవుతోంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు భావ ప్రకటనా స్వేచ్ఛను సమర్థించడం, అధికారంలోకి వచ్చిన తర్వాత విమర్శలను నియంత్రించాలనే ధోరణి ప్రపంచంలోని అనేక ప్రజాస్వామ్య వ్యవస్థల్లో కనిపిస్తున్న వాస్తవం. అందుకే ప్రజాస్వామ్యం వ్యక్తులపై కాకుండా, వ్యవస్థల నిష్పాక్షికతపై ఆధారపడి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.ప్రజలకు కావాల్సింది ఎక్కువ అరెస్టులు కాదు. తక్కువ అరెస్టులు కూడా కాదు. అందరికీ ఒకే ప్రమాణం కావాలి. వ్యక్తి ఎవరు అనే అంశం కంటే, అతను లేదా ఆమె చేసిన వ్యాఖ్య చట్టాన్ని ఉల్లంఘించిందా లేదా అనే అంశమే ప్రాధాన్యత పొందాలి. పార్టీ ఏది, పదవి ఏమిటి అనే విషయాలు చట్ట అమలులో ప్రభావం చూపకూడదు.చట్టం ముందు అందరూ సమానమని చెప్పడం సులభం. అయితే ఆ సమానత్వాన్ని ఆచరణలో చూపించడం ప్రజాస్వామ్య వ్యవస్థల అసలైన పరీక్ష. ఎందుకంటే చట్టం వ్యక్తిని బట్టి మారడం ప్రారంభించిన రోజున న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసం బలహీనపడుతుంది. న్యాయం బలహీనపడిన చోట ప్రజాస్వామ్యం తన అసలు స్ఫూర్తిని కోల్పోయి, కేవలం ఎన్నికల ప్రక్రియకే పరిమితమయ్యే ప్రమాదం ఉంటుంది.

# బొబ్బిలి సబ్‌జైలులో కేవీ రెడ్డిని పరామర్శించిన వైఎస్సార్‌సీపీ నేతలు

తప్పుడు కేసులతో గొంతులు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపణ..

తెలంగాణ సీనియర్ జర్నలిస్టుకు పార్టీ అండగా ఉంటుందని భరోసా..

ఏపీ బ్యూరో / జులై 03, ప్రజా ప్రేరణ :

తెలంగాణకు చెందిన సీనియర్ జర్నలిస్టు, యూట్యూబ్ విశ్లేషకుడు కేవీ రెడ్డి అరెస్టు వ్యవహారం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. కూటమి ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే కేవీ రెడ్డిపై తప్పుడు కేసులు నమోదు చేసి అరెస్టు చేయించిందని వైఎస్సార్‌సీపీ నేతలు ఆరోపించారు. ప్రస్తుతం బొబ్బిలి సబ్‌జైలులో ఉన్న కేవీ రెడ్డిని వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం పరామర్శించి సంఘీభావం తెలిపారు.వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన్న అప్పలనాయుడు, మాజీ మున్సిపల్ ఛైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, పార్టీ నాయకుడు ఇంటి గోపాలరావు బొబ్బిలి సబ్‌జైలుకు వెళ్లి కేవీ రెడ్డిని కలిశారు. ఆయన ఆరోగ్య పరిస్థితి, కేసు వివరాలను తెలుసుకుని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా కేవీ రెడ్డికి పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చినట్లు తెలిపారు.కేవీ రెడ్డి అరెస్టు వ్యవహారంపై స్పందించిన వైఎస్సార్‌సీపీ నేతలు, భావ ప్రకటనా స్వేచ్ఛపై దాడులు పెరుగుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ





విధానాలను ప్రశ్నించే వారిపై కేసులు నమోదు చేసి, అరెస్టులకు పాల్పడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని విమర్శించారు.జర్నలిస్టులు, యూట్యూబర్లు, సామాజిక మాధ్యమాల ప్రతినిధులపై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా భయానక వాతావరణం సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు.కేవీ రెడ్డిపై నమోదైన కేసు రాజకీయ ప్రేరేపితమైందని, ఈ కేసులో వాస్తవాలను వెలికితీయాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడ్డారు.భావ ప్రకటనా స్వేచ్ఛను అణిచివేసే చర్యలను వైఎస్సార్‌సీపీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు.ఇదిలా ఉండగా, విజయనగరం జిల్లా పోలీసులు విడుదల చేసిన వివరాల ప్రకారం, భారత రాజ్యాంగంపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో తెలంగాణ రాష్ట్రానికి చెందిన కోషిక వెంకటరామరెడ్డిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఈ కేసులో బొబ్బిలి న్యాయస్థానం ఆయనకు 14 రోజుల జ్యుడిషియల్ కస్టడీ విధించింది. అనంతరం ఆయనను బొబ్బిలి సబ్‌జైలుకు తరలించారు.ఈ నేపథ్యంలో కేవీ రెడ్డి అరెస్టు వ్యవహారం రాజకీయ, మీడియా వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. చట్టం అందరికీ సమానంగా అమలుకావాలని, భావ ప్రకటనా స్వేచ్ఛను పరిరక్షించేలా ప్రభుత్వాలు వ్యవహరించాలని వివిధ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# ఈ దారుణాల వెనుక పెద్ద కుట్ర ఉంది

రాష్ట్రంలో జంగిల్ రాజ్ నడుస్తోంది: వైఎస్ జగన్ మోహన్ రెడ్డి...

పోలీసులను ఉపయోగించుకుని సిండికేట్‌గా ఏర్పడి హత్యలు చేస్తున్నారు...

క్రాంతి కుమార్ కుటుంబానికి న్యాయం జరిగే వరకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని స్పష్టం...

ఏపీ బ్యూరో / జులై 03, ప్రజా ప్రేరణ :

రాష్ట్రంలో చట్టవ్యవస్థ పూర్తిగా దిగజారిపోయిందని, పోలీసు వ్యవస్థను ఉపయోగించుకుని కొందరు సిండికేట్‌గా ఏర్పడి దారుణాలకు పాల్పడుతున్నారని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆరోపించారు. క్రాంతి కుమార్ మృతి ఘటనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన ఆయన, ఈ ఘటన వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని అన్నారు. మీడియాతో మాట్లాడిన ఆయన, రాష్ట్రంలో ప్రస్తుతం జంగిల్ రాజ్ నడుస్తోందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.క్రాంతి కుమార్‌పై గత ఎనిమిదేళ్లుగా ఎలాంటి కేసులు నమోదు కాలేదని, అలాంటి వ్యక్తిని గత మూడు నెలలుగా ప్రతిరోజూ పోలీసు స్టేషన్‌కు రావాలని ఒత్తిడి చేయడం వెనుక ఉన్న కారణాలపై సమగ్ర విచారణ జరగాలని డిమాండ్



చేశారు. తన చేత చేయకూడని పనులను బలవంతంగా చేయించారని క్రాంతి కుమార్ స్వయంగా వీడియోలో వెల్లడించాడని గుర్తు చేశారు. ఈ అంశం పోలీసు వ్యవస్థ పనితీరుపై తీవ్ర అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు. పోలీసు వ్యవస్థలోని దిగజారుడు పరిస్థితులకు ఈ ఘటన ఒక ప్రత్యక్ష ఉదాహరణగా నిలిచిందని వైఎస్ జగన్ వ్యాఖ్యానించారు. కింది స్థాయి అధికారులను పైస్థాయి అధికారులు రక్షిస్తున్న పరిస్థితి రాష్ట్రంలో నెలకొన్నదని ఆరోపించారు. సీఐని సీపీ, సీపీని డీజీపీ, డీజీపీని ముఖ్యమంత్రి కాపాడుతున్న పరిస్థితి కనిపిస్తోందని విమర్శించారు.ఈ ఘటనకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్ వ్యవహారంపై కూడా ఆయన అనేక ప్రశ్నలు లేవనెత్తారు. సీసీటీవీ దృశ్యాలను ఎవరైనా ఇష్టానుసారంగా తొలగించగలరా, వాటికి బ్యాకప్ వ్యవస్థ ఉండదా అని ప్రశ్నించారు. కీలక ఆధారాల పరిరక్షణ విషయంలో కూడా తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోందని ఆరోపించారు.రాజధాని ప్రాంతంలో ఒక వ్యవస్థీకృత రాకెట్ పనిచేస్తోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, ఈ మొత్తం వ్యవహారంపై స్వతంత్ర దర్యాప్తు అవసరమని వైఎస్ జగన్ డిమాండ్ చేశారు..క్రాంతి కుమార్ మరణానికి బాధ్యులైన వారిపై ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసు నమోదు చేయాలని కోరారు.ఇంత తీవ్రమైన ఆరోపణలు, ఆధారాలు వెలుగులోకి వచ్చినప్పటికీ ఇప్పటి వరకు కనీసం కేసు కూడా నమోదు చేయకపోవడం ఆశ్చర్యకరమని వైఎస్ జగన్ వ్యాఖ్యానించారు. బాధ్యులపై తక్షణ చర్యలు తీసుకోవాలని, క్రాంతి కుమార్ కుటుంబానికి పూర్తి న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.క్రాంతి కుమార్ కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని, న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని వైఎస్ జగన్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో చట్టవ్యవస్థపై ప్రజల్లో నెలకొంటున్న అనుమానాలను నివృత్తి చేయాలంటే ప్రభుత్వం పారదర్శక విచారణకు ఆదేశాలు ఇవ్వాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

# వివాహ వేడుకకు హాజరైన బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, వెంకాయమ్మ...





ఏపీ బ్యూరో / జులై 03, ప్రజా ప్రేరణ :

ప్రకాశం జిల్లా,ముండ్లమూరు మండలం, ఈదర గ్రామంలో నిర్వహించిన పోతిరెడ్డి శివారెడ్డి వివాహ వేడుక ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా దర్శి ఎమ్మెల్యే, ప్రకాశం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ వివాహ కార్యక్రమానికి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు.వివాహ వేదిక వద్దకు చేరుకున్న బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, వెంకాయమ్మలకు కుటుంబ సభ్యులు, బంధువులు ఘన స్వాగతం పలికారు. అనంతరం నూతన దంపతులను కలిసి వారి వైవాహిక జీవితం ఆనందంగా, ఆయురారోగ్యాలతో సాగాలని ఆకాంక్షిస్తూ ఆశీస్సులు అందజేశారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో వారు ఆప్యాయంగా మాట్లాడి శుభాకాంక్షలు తెలియజేశారు. వేద మంత్రోచ్చారణల మధ్య సంప్రదాయబద్ధంగా నిర్వహించిన వివాహ వేడుకలో బంధుమిత్రులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.నూతన దంపతులు సుఖశాంతులతో, సంతోషంగా జీవించాలని ఆకాంక్షిస్తూ అతిథులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు, బంధువులు పాల్గొన్నారు.13

# విశాఖ స్టీల్ ప్రైవేటీకరణను నిలిపివేయాలి..

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మార్కాపురంలో నిరసన ర్యాలీ...

మృత కార్మికుల కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం ఇవ్వాలని డిమాండ్...






ఏపీ బ్యూరో / జులై 03, ప్రజా ప్రేరణ :

విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించే చర్యలను తక్షణమే నిలిపివేయాలని, పరిశ్రమలో కార్మికుల ఉద్యోగ భద్రతను కాపాడాలని డిమాండ్ చేస్తూ మార్కాపురం జిల్లాలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. కోర్టు సెంటర్‌లోని ఏఐటీయూసీ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరిన నాయకులు, కార్మికులు స్థానిక రెవెన్యూ డివిజనల్ అధికారికి వినతిపత్రం సమర్పించారు.రాష్ట్రవ్యాప్తంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనల్లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కార్మికులు, సంఘ నాయకులు పాల్గొన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ దేశ ఆర్థికాభివృద్ధికి కీలకమైన ఆస్తి అని, దానిని ప్రైవేటీకరించడం వల్ల వేలాది మంది కార్మికుల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఏఐటీయూసీ అధ్యక్షుడు ఆర్. రవీంద్రనాథ్ మాట్లాడుతూ, విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించే ప్రయత్నాలను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. గత నెల 8వ తేదీన విశాఖ ఉక్కు పరిశ్రమలో జరిగిన ఘటనలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలకు ఒక్కొక్కరికి కోటి రూపాయల పరిహారం చెల్లించాలని కోరారు. అలాగే పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులందరికీ సంపూర్ణ ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించడం ప్రభుత్వాల బాధ్యత అని, కార్మికుల హక్కులు, భద్రత విషయంలో రాజీ పడబోమని ఆయన స్పష్టం చేశారు. కార్మికుల సంక్షేమాన్ని విస్మరించే విధానాలను ఏఐటీయూసీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని పేర్కొన్నారు.అనంతరం రెవెన్యూ డివిజనల్ అధికారికి వినతిపత్రం అందజేసి, తమ డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు.

# ఉపనయన మహోత్సవంలో పాల్గొన్న అన్నా దుర్గాకుమారి

శ్రీవత్సవ్‌కు ఆశీర్వాదాలు అందించిన అన్నా దుర్గాకుమారి...





ఏపీ బ్యూరో / జులై 03, ప్రజా ప్రేరణ :

మార్కాపురం మండలం, గజ్జలకొండ గ్రామంలో నిర్వహించిన శిరసనగండ్ల కుటుంబ ఉపనయన మహోత్సవం ఆధ్యాత్మిక, సంప్రదాయ వాతావరణంలో ఘనంగా జరిగింది. శిరసనగండ్ల చంద్రశేఖరశర్మ, లావణ్య దంపతుల కుమారుడు వెంకట నాగ శ్రీవత్సవ్ విశ్వనాథశర్మ ఉపనయన సంస్కార కార్యక్రమానికి పలువురు ప్రముఖులు, బంధుమిత్రులు హాజరై ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో గిద్దలూరు మాజీ శాసనసభ్యుడు, మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇంచార్జి అన్నా రాంబాబు సతీమణి అన్నా దుర్గాకుమారి పాల్గొన్నారు. ఉపనయన సంస్కారాన్ని వీక్షించి, వటువుకు ఆశీర్వాదాలు అందజేశారు. కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా ముచ్చటించి, శుభాకాంక్షలు తెలియజేశారు.వేద మంత్రోచ్చారణల మధ్య సంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో బంధువులు, ఆహ్వానితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వటువు విద్య, ఆయురారోగ్యాలు, సకల శుభాలు కలగాలని ఆకాంక్షిస్తూ ఆశీర్వదించారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు హాజరైన అతిథులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

www.prajaprerana.co.in RNI : APTEL/26/A3850
ప్రజా ప్రేరణ న్యూస్
prajaprerana.2026@gmail.com
నిజం | నిష్పక్షపాతం | ప్రజా ప్రేరణ



# పట్టాభిరామస్వామి కల్యాణోత్సవ వేడుకల్లో..





## బండలాగుడు పోటీలలో కేపీ నాగార్జున రెడ్డి..

ఏపీ బ్యూరో / జులై 03, ప్రజా ప్రేరణ :

మార్కాపురం జిల్లా, కంభం మండలం, ఔరంగా బాద్ గ్రామంలో నిర్వహించిన పట్టాభిరామస్వామి కల్యాణ మహోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా సాగాయి. ఈ సందర్భంగా సంప్రదా య క్రీడలకు ప్రతీకగా నిలిచే బండలాగుడు పోటీలను గిద్దలూరు నియోజకవర్గ ఇంచార్జి కె.పి. నాగార్జున రెడ్డి ప్రారంభించారు. గ్రామీణ సంప్రదాయాలకు ప్రతిబింబంగా నిలిచిన ఈ పోటీలను తిలకించేందుకు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. ముందుగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం బండలాగుడు పోటీలకు నాగార్జున రెడ్డి జెండా ఊపి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఇలాంటి సాంప్రదాయ క్రీడలు గ్రామీణ యువతలో ఉత్సాహాన్ని పెంపొందించడం తో పాటు సామాజిక ఐక్యతను బలోపేతం చేస్తాయని అన్నారు. పోటీల్లో పాల్గొన్న ఎద్దుల యజమానులు, రైతులు తమ ప్రతిభను ప్రదర్శించగా, ప్రేక్షకులు హర్షధ్వానాలతో వారిని ప్రోత్సహించారు. కార్యక్రమం మొత్తం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసా గింది. గ్రామీణ ప్రాంతాల్లో సాంప్రదాయ క్రీడలకు ప్రజల్లో ఉన్న ఆదరణ మరోసారి స్పష్టమైందని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చేగిరెడ్డి ఓబుల్ రెడ్డి తులసమ్మ, రాష్ట్ర మైనారిటీ విభాగ కార్యదర్శి అబ్దుల్ గఫార్, కన్వీనర్ గొంగటి చెన్నారెడ్డి, ఖాసీం ఖాన్ తదితర నాయకులు పాల్గొన్నారు. అలాగే స్థానిక ప్రజాప్రతి నిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



# పునఃప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్న అన్నా రాంబాబు..

ఏపీ బ్యూరో / జులై 03, ప్రజా ప్రేరణ :

మార్కాపురం జిల్లా,గిద్దలూరు నియోజకవర్గం, కోమరోలు మండలం, గోపానిపల్లె గ్రామంలో నిర్వహించిన శ్రీ నాగదేవత, శ్రీ పోతురాజు సహిత పోలేరమ్మ తల్లి పునఃప్రతిష్ట మహోత్సవం, శ్రీ పోతురాజు, అంకాలమ్మ తల్లి నూతన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇంచార్జి అన్నా రాంబాబు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణానికి చేరుకున్న అన్నా రాంబాబుకు ఆలయ నిర్వాహకులు, గ్రామ పెద్దలు, భక్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య నిర్వహించిన పునఃప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట మహోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా శ్రీ నాగదేవత, శ్రీ పోతురాజు, పోలేరమ్మ తల్లి, అంకాలమ్మ తల్లి విగ్రహాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రాంతం సుభిక్షంగా అభివృద్ధి చెందాలని ప్రార్థనలు చేశారు.పునఃప్రతిష్ట మహోత్సవం సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో




కిటకిటలాడింది. గ్రామస్థులు, పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. సంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తిపారవశ్య వాతావరణాన్ని సృష్టించాయి.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

# ఉపాలయాల ప్రతిష్ఠోత్సవంలో పాల్గొన్న అన్నా రాంబాబు





## ప్రత్యేక పూజలు నిర్వహించిన మార్కాపురం వైఎస్సార్‌సీపీ ఇంచార్జి...



ఏపీ బ్యూరో / జులై 03, ప్రజా ప్రేరణ :

మార్కాపురం జిల్లా, గిద్దలూరు పట్టణంలోని పౌరాణిక, చారిత్రక ప్రాధాన్యం కలిగిన ప్రసిద్ధ శ్రీ పాతాళ నాగేశ్వరస్వామి ఆలయంలో నూతనంగా నిర్మించిన ఉపాలయాల విగ్రహ ప్రతిష్ఠోత్సవ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో కొనసాగుతోంది. ఈ సందర్భంగా గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇంచార్జి అన్నా రాంబాబు ప్రతిష్ఠోత్సవ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.శ్రీ పాతాళ నాగేశ్వరస్వామి ఆలయ సముదాయం అభివృద్ధిలో భాగంగా నిర్మించిన శ్రీ లక్ష్మీ గణపతి, శ్రీవల్లీ దేవసేన షణ్ముఖ సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు జూన్ 30 నుంచి జులై 3 వరకు వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాలకు ఆలయ అభివృద్ధికి సహకరించిన దాతలు, భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నారు.ఆహ్వానం మేరకు ఆలయానికి చేరుకున్న అన్నా రాంబాబుకు ప్రతిష్ఠోత్సవ నిర్వాహకులు, స్థానిక నాయకులు, భక్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన వేద పండితుల మార్గదర్శకత్వంలో నిర్వహిస్తున్న ప్రతిష్ఠోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా శ్రీ పాతాళ నాగేశ్వరస్వామిని, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి, భక్తుల సంక్షేమం, ప్రజల సుఖశాంతుల కోసం ప్రార్థనలు చేశారు.కాగా, 2019 నుంచి 2024 మధ్య కాలంలో శ్రీ పాతాళ నాగేశ్వరస్వామి ఆలయ సముదాయం అభివృద్ధి కోసం దాతలు, దేవాదాయ శాఖ సమన్వయంతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు స్థానికులు గుర్తు చేశారు. ఆలయ ప్రాంగణంలో నిర్మించిన ఉపాలయాలు పూర్తి కావడంతో ప్రతిష్ఠోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, వేద పండితులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

# ఆరోగ్య దీపిక - మీ ఆరోగ్యం మీ చేతుల్లోనే..

## పిల్లలు మరియు యుక్తవయస్సు వారిలో స్థూలకాయానికి కారణాలు..

ఏపీ బ్యూరో / జులై 03, ప్రజా ప్రేరణ :



అధిక క్యాలరీలు ఉన్న జంక్ ఫుడ్, ఫాస్ట్ ఫుడ్ ఎక్కువగా తినడం.చక్కెర ఎక్కువగా ఉండే శీతల పానీయాలు, స్వీట్లు తరచుగా తీసుకోవడం.శారీరక వ్యాయామం లేకపోవడం.ఎక్కువసేపు టీవీ చూడడం, మొబైల్ ఫోన్ లేదా కంప్యూటర్ ఉపయోగించడం వల్ల శారీరక కదలికలు తగ్గిపోవడం.తగినంత నిద్ర లేకపోవడం. కుటుంబంలో స్థూలకాయం చరిత్ర (వంశపారంపర్య ప్రభావం).ఒత్తిడి, ఆందోళన లేదా భావోద్వేగాల కారణంగా ఎక్కువగా తినడం.అసమయానికి భోజనం చేయడం లేదా తరచుగా చిరుతిండ్లు తినడం.పోషకాహారం కంటే ప్రాసెస్ చేసిన ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవడం.కొన్ని హార్మోన్ల సమస్యలు లేదా అరుదుగా కొన్ని ఆరోగ్య సమస్యలు.టీనేజ్‌లో అధిక బరువు రాకుండా ఎలా చూసుకోవాలి?..యుక్తవయస్సు వారిపై నిద్ర మరియు రాత్రి ఆలస్యంగా తినే అలవాట్ల ప్రభావం,,తగినంత నిద్ర లేకపోతే అలసట, ఏకాగ్రత లోపం మరియు జ్ఞాపకశక్తి తగ్గడం జరుగుతుంది.నిద్రలేమి వల్ల ఆకలిని నియంత్రించే హార్మోన్లలో మార్పులు వచ్చి ఎక్కువగా తినాలనే కోరిక పెరుగుతుంది.రాత్రి ఆలస్యంగా భోజనం చేయడం వల్ల జీర్ణక్రియ మందగించి అజీర్ణం, గ్యాస్, అసౌకర్యం వంటి సమస్యలు రావచ్చు.తరచుగా ఆలస్యంగా తినడం వల్ల అధిక బరువు మరియు స్థూలకాయం వచ్చే ప్రమాదం పెరుగుతుంది.సరైన నిద్ర లేకపోవడం వల్ల చదువులో పనితీరు, ఏకాగ్రత మరియు జ్ఞాపకశక్తి దెబ్బతినవచ్చు.నిద్రలేమి వల్ల చిరాకు, ఒత్తిడి, ఆందోళన వంటి మానసిక సమస్యలు పెరిగే అవకాశం ఉంటుంది.ఆలస్యంగా తినే అలవాటు వల్ల శరీర జీవక్రియ (మెటాబాలిజం)పై ప్రతికూల ప్రభావం పడవచ్చు.దీర్ఘకాలంలో ఆరోగ్యకరమైన జీవనశైలిపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంటుంది.కొన్ని సూచనలు:సమతుల్యమైన, పోషకాహారం తీసుకోవాలి..రోజూ కనీసం 60 నిమిషాలు శారీరక వ్యాయామం చేయాలి.జంక్ ఫుడ్, చక్కెర ఎక్కువగా ఉన్న పానీయాలను తగ్గించాలి.పండ్లు, కూరగాయలు, ధాన్యాలు, ప్రోటీన్ ఉన్న ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవాలి.తగినంత నీరు తాగాలి.రోజుకు 8-10 గంటలు నిద్రపోవాలి.మొబైల్, టీవీ, వీడియో గేమ్స్ వంటి స్క్రీన్ టైమ్‌ను పరిమితం చేయాలి.కుటుంబ సభ్యులతో కలిసి ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు పాటించాలి.ఈ అలవాట్లు యుక్తవయస్సులో ఆరోగ్యకరమైన బరువును మరియు స్థూలకాయం ప్రమాదాన్ని తగ్గించడానికి సహాయపడతాయి.

# తహసీల్దార్‌ను కలిసిన ఉద్యోగ సంఘాల ప్రతినిధులు..





## ఉద్యోగుల సమస్యలను వివరించిన నాయకులు..

## సమస్యల పరిష్కారానికి సహకరిస్తానని తహసీల్దార్ హామీ..

ఏపీ బ్యూరో / జులై 03, ప్రజా ప్రేరణ :

మార్కాపురం జిల్లా, ఎర్రగొండపాలెం మండలానికి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ ఉప్పలపాటి విజయ భాస్కర్‌ను ఉద్యోగ సంఘాల ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రం అందజేశారు.ఈ సమావేశంలో రాష్ట్ర వర్క్ ఛార్జ్ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు ఆలేటి నాగయ్య, డివిజన్ ఆర్ అండ్ బి అధ్యక్షుడు ఎం. వెంకటసుబ్బయ్య, ఈ. అబ్రహం, కె. రామునాయక్‌తో పాటు పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.ఉద్యోగుల సేవా సంబంధిత సమస్యలు, కార్యాలయ పరిపాలనా అంశాలు, ఇతర అవసరాలను తహసీల్దార్‌కు వివరించారు.ఉద్యోగుల సమస్యలను శ్రద్ధగా విన్న తహసీల్దార్ ఉప్పలపాటి విజయ భాస్కర్, తమ దృష్టికి తీసుకొచ్చిన అంశాలపై సానుకూలంగా స్పందిస్తానని తెలిపారు. నిబంధనల పరిధిలో పరిష్కరించగల సమస్యల విషయంలో తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.అనంతరం ఉద్యోగ సంఘాల నాయకులు నూతన తహసీల్దార్‌కు శుభాకాంక్షలు తెలియజేసి, పరిపాలనలో ప్రజలకు, ఉద్యోగులకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు. 15

# ఓటర్లకు అలర్ట్.. ఫారం సమర్పణకు ఇంకా 12 రోజులే...

సమగ్ర సవరణ ప్రక్రియలో నెమ్మదించిన స్పందన...

గడువులోగా ఫారం ఇవ్వకపోతే ముసాయిదా జాబితాలో పేరు లేకపోయే అవకాశం...








ఏపీ బ్యూరో / జులై 03, ప్రజా ప్రేరణ :

ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ఓటర్లు అప్రమత్తంగా ఉండాలని ఎన్నికల యంత్రాంగం సూచించింది. ప్రతి ఓటరికి అందజేస్తున్న ఎన్యూమరేషన్ ఫారాన్ని పూర్తి చేసి జులై 14లోపు సంబంధిత బూత్ లెవల్ అధికారికి తప్పనిసరిగా సమర్పించాలని స్పష్టం చేసింది. గడువులోగా ఫారాలు సమర్పించని వారి పేర్లు జులై 21న విడుదలయ్యే ముసాయిదా ఓటర్ల జాబితాలో లేకపోయే అవకాశం ఉందని హెచ్చరించింది.రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల జాబితా సమగ్ర సవరణ కార్యక్రమం కొనసాగుతున్నప్పటికీ, ఫారాల సమర్పణ ప్రక్రియ ఆశించిన స్థాయిలో జరగడం లేదని సమాచారం. రాష్ట్రంలో ఉన్న మొత్తం 4.16 కోట్ల మంది ఓటర్లలో ఇప్పటివరకు కేవలం 1.56 కోట్ల మంది మాత్రమే ఎన్యూమరేషన్ ఫారాలను నింపి తిరిగి సమర్పించారు. ఇది మొత్తం ఓటర్లలో 37.66 శాతానికి మాత్రమే పరిమితమైంది.ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం, ప్రతి ఓటరు తన వ్యక్తిగత వివరాలను ధ్రువీకరించి, అవసరమైన సమాచారంతో ఫారాన్ని సమర్పించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ ద్వారా ఓటర్ల జాబితాను మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించడమే లక్ష్యమని అధికారులు చెబుతున్నారు.జులై 21న విడుదలయ్యే ముసాయిదా ఓటర్ల జాబితా అనంతరం అభ్యంతరాలు, సవరణలకు అవకాశం ఉన్నప్పటికీ, ముందస్తుగా ఫారం సమర్పించడం ద్వారా ఇబ్బందులను నివారించవచ్చని అధికారులు సూచిస్తున్నారు. గడువులోగా స్పందించని ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగంలో సమస్యలు ఎదుర్కొనే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రతి ఓటరు తమ ప్రాంత బీఎల్‌వోను సంప్రదించి, ఎన్యూమరేషన్ ఫారాన్ని వెంటనే పూర్తి చేసి సమర్పించాలని ఎన్నికల యంత్రాంగం విజ్ఞప్తి చేసింది.ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి పౌరుడు తన పేరు ఓటర్ల జాబితాలో కొనసాగుతున్నదో లేదో నిర్ధారించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొంది.21

# తెల్లవారితే పెళ్లి.. అంతలోనే ఘోర విషాదం...





కంభంలో ఆటోను ఢీకొట్టిన లారీ.. నలుగురు మృతి, పలువురికి గాయాలు...

పెళ్లికి వెళ్తున్న గిద్దలూరు కుటుంబానికి తీరని విషాదం...

ఏపీ బ్యూరో / జులై 03, ప్రజా ప్రేరణ :

మార్కాపురం జిల్లా, కంభం పట్టణంలో అర్ధరాత్రి చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదం గిద్దలూరు ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకునేలా చేసింది. తెల్లవారితే పెళ్లి వేడుకలో పాల్గొనాల్సిన కుటుంబ సభ్యులు రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు.అమరావతి--అనంతపురం జాతీయ రహదారి ఎన్‌హెచ్--545పై జరిగిన ఈ ప్రమాదంలో నలుగురు మృతి చెందగా, మరో ఎనిమిది మంది గాయపడ్డారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, గిద్దలూరు పట్టణంలోని నల్లబండ బజార్ ప్రాంతానికి చెందిన కుటుంబ సభ్యులు వివాహ కార్యక్రమానికి హాజరయ్యేందుకు ఆటోలో ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో కంభం పట్టణంలోని వరసిద్ధి వినాయకస్వామి ఆలయం సమీపంలో, స్థానిక కాలే లాడ్జి వద్ద రహదారి పక్కన ఆగి ఉన్న ఆటోను గుంటూరు వైపు నుంచి అతివేగంగా వస్తున్న లారీ బలంగా ఢీకొట్టింది.కొబ్బరి తుంపర పొట్టు లోడుతో మదనపల్లి నుంచి తెలంగాణలోని వైరా వైపు వెళ్తున్న లారీ అదుపుతప్పి ముందుగా ఆటోను ఢీకొట్టినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. అనంతరం పక్కనే నిలిపి ఉన్న ద్విచక్ర వాహనాలు, బొలెరో వాహనం, రహదారి పక్కనున్న దుకాణాల వైపు దూసుకెళ్లడంతో ఘటన స్థలంలో భయానక పరిస్థితులు నెలకొన్నాయి.ఈ ప్రమాదంలో గిద్దలూరు నల్లబండ బజార్‌కు చెందిన ఆవుల అలకనంద (19), ఆవుల అంకాలు (20), ఆవుల నాగేశ్ (17) అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన ఆవుల నాగేశ్వరి (2) చికిత్స పొందుతూ మరణించినట్లు పోలీసులు తెలిపారు. మరో ఎనిమిది మంది గాయపడగా, వారిని కంభం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.మృతులు, గాయపడిన వారందరూ పెళ్లికూతురు కుటుంబ సభ్యులేనని సమాచారం. వివాహ వేడుకకు వెళ్తున్న సమయంలో ఈ దుర్ఘటన చోటుచేసుకోవడంతో రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.ఆనందోత్సాహాల మధ్య జరగాల్సిన పెళ్లి వేడుక శోకసంద్రంగా మారింది.ప్రమాదానికి లారీ డ్రైవర్ అతివేగం, నిద్రమత్తే కారణమై ఉండవచ్చని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సమాచారం అందుకున్న కంభం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున, సబ్ ఇన్‌స్పెక్టర్ శివరామిరెడ్డి సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుని, గాయపడిన వారిని వెంటనే ఆసుపత్రులకు తరలించారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలను గుర్తించేందుకు దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు.కంభం రోడ్డు ప్రమాదం గిద్దలూరు ప్రాంతాన్ని విషాదంలో ముంచెత్తగా, మృతుల కుటుంబ సభ్యుల రోదనలు ప్రతి ఒక్కరినీ కలిచివేస్తున్నాయి.

# డిజిటల్ దొంగలతో జాగ్రత్త సుమా,, వేమన...




ఏపీ బ్యూరో / జులై 03, ప్రజా ప్రేరణ :

మొబైల్ ఫోన్లు, ఇంటర్నెట్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో సైబర్ నేరగాళ్లు అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకుని వివిధ రకాల మోసాలకు పాల్పడుతున్నారని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని మార్కాపురం రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ వేమన సూచించారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడిన ఆయన, సాంకేతికతను ఆసరాగా చేసుకుని నేరగాళ్లు కొత్త కొత్త మార్గాల్లో ప్రజలను వంచిస్తున్నారని తెలిపారు.బ్యాంకు ఖాతాలు నిలిపివేస్తామని, బహుమతులు వచ్చాయని, తక్కువ సమయంలో అధిక లాభాలు వస్తాయని నమ్మబలికి ప్రజల నుంచి వ్యక్తిగత వివరాలు సేకరించి మోసాలకు పాల్పడుతున్న ఘటనలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్, సందేశాలు, సామాజిక మాధ్యమాల ద్వారా వచ్చే అనుమానాస్పద సమాచారంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.బ్యాంకు ఖాతా సంఖ్యలు, ఏటీఎం కార్డు వివరాలు, రహస్య సంకేత సంఖ్యలు, ఒకసారి వినియోగించే ధ్రువీకరణ సంఖ్యలు వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని హెచ్చరించారు. తెలియని లింకులను తెరవడం, అపరిచిత దరఖాస్తులను మొబైల్ ఫోన్లలో ఏర్పాటు చేసుకోవడం వల్ల ఆర్థిక నష్టాలు ఎదురయ్యే ప్రమాదం ఉందన్నారు. సైబర్ మోసానికి గురైనట్లు అనుమానం వచ్చిన వెంటనే ఆలస్యం చేయకుండా పోలీసులను సంప్రదించాలని, ప్రజల అప్రమత్తతే సైబర్ నేరాల నివారణకు ప్రధాన మార్గమని వేమన పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాల ప్రజలు కూడా డిజిటల్ లావాదేవీల విషయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# కంభం రోడ్డు ప్రమాదంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన వైఎస్ జగన్...

బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి...

గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని విజ్ఞప్తి...



ఏపీ బ్యూరో / జులై 03, ప్రజా ప్రేరణ :

మార్కాపురం జిల్లా, కంభం పట్టణంలో చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదంపై వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో చిన్నారి సహా నలుగురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. పెళ్లి వేడుకలకు హాజరైన కుటుంబ సభ్యులు ఆలయ దర్శనానికి వెళ్తున్న సమయంలో ఈ విషాద ఘటన చోటుచేసుకోవడం హృదయ విదారకమని వైఎస్ జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆనందోత్సాహాల మధ్య ఉండాల్సిన కుటుంబంలో ఒక్కసారిగా తీవ్ర విషాదం నెలకొనడం కలచివేస్తోందని పేర్కొన్నారు.ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు వైఎస్ జగన్ ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. బాధిత కుటుంబ సభ్యులు ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని పొందాలని ఆకాంక్షించారు.ప్రమాదంలో గాయపడిన వారికి ప్రభుత్వం తక్షణమే అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని వైఎస్ జగన్ కోరారు. తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న వారి ఆరోగ్య పరిస్థితిని ప్రభుత్వం ప్రత్యేకంగా పర్యవేక్షించాలని సూచించారు. గాయపడిన వారి చికిత్సకు అయ్యే పూర్తి ఖర్చును ప్రభుత్వం భరించాలని విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా, ఈ ప్రమాదంలో కుటుంబ సభ్యులను కోల్పోయిన బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తక్షణ ఆర్థిక సహాయం ప్రకటించి, అన్ని విధాలుగా అండగా నిలవాలని వైఎస్ జగన్ కోరారు. ఇటువంటి విషాద ఘటనలు పునరావృతం కాకుండా రోడ్డు భద్రతా చర్యలను మరింత పటిష్టం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.కంభం పట్టణంలో జరిగిన ఈ ఘోర ప్రమాదం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చిందని, బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని వైఎస్ జగన్ విజ్ఞప్తి చేశారు.

# తిరుమలనాథ స్వామి తిరునాళ్లకు పటిష్ట బందోబస్తు...





డ్రోన్లు, సీసీటీవీలతో ప్రత్యేక నిఘా...

50 వేల మంది భక్తుల రాకకు విస్తృత ఏర్పాట్లు చేసిన మార్కాపురం జిల్లా పోలీసులు...

ఏపీ బ్యూరో / జులై 03, ప్రజా ప్రేరణ :

మార్కాపురం జిల్లా, పెద్దారవీడు మండలంలో, నిర్వహించనున్న శ్రీ తిరుమలనాథ స్వామి తిరునాళ్ల సందర్భంగా భక్తుల భద్రతకు మార్కాపురం జిల్లా పోలీసులు విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేపట్టారు. జులై 4న జరిగే తిరునాళ్లకు సుమారు 50 వేల మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉండటంతో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తున్నారు.మార్కాపురం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసు శాఖ అధికారులు తిరునాళ్ల ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పెద్దారవీడు ఎస్ఐ ఆలయ పరిసర ప్రాంతాలను సందర్శించి, భక్తుల రద్దీ నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, వాహనాల పార్కింగ్ ఏర్పాట్లు, భద్రతా చర్యలను సమీక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచనలు చేశారు.అలాగే త్రిపురాంతకం సీఐ తిరునాళ్ల సందర్భంగా భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో అదనపు పోలీసు బలగాలను మోహరించాలని, దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలు, ఇతర అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు.తిరునాళ్ల ప్రాంతమంతటా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఆలయ పరిసరాలు, భక్తులు అధిక సంఖ్యలో గుమిగూడే ప్రాంతాలు, ప్రధాన రహదారులు, వాహనాల పార్కింగ్ కేంద్రాల్లో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అదనంగా డ్రోన్ కెమెరాల ద్వారా నిరంతర నిఘా నిర్వహిస్తూ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించనున్నారు.భక్తుల రాకపోకలకు అంతరాయం కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టడంతో పాటు, అత్యవసర సేవల సమన్వయానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు పోలీసు అధికారులు తెలిపారు. రద్దీ ప్రాంతాల్లో భక్తులకు మార్గనిర్దేశం చేసేందుకు అదనపు సిబ్బందిని నియమించారు.తిరునాళ్లకు విచ్చేసే భక్తులు పోలీసు శాఖ సూచనలను పాటించి సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపించిన వెంటనే సమీపంలోని పోలీసు సిబ్బందికి సమాచారం అందించాలని సూచించారు. భక్తులకు సురక్షితమైన, ప్రశాంతమైన వాతావరణం కల్పించేందుకు అన్ని విధాల చర్యలు చేపట్టినట్లు మార్కాపురం జిల్లా పోలీసులు తెలిపారు.

# ఉపాధి కూలీలకు కేంద్రం శుభవార్త...

రోజువారీ వేతనం పెంపు.. పని దినాలు 125కు విస్తరణ..

గ్రామీణ పేద కుటుంబాలకు అదనపు ఆదాయం.. ఉపాధి భరోసా మరింత బలోపేతం...

ఏపీ బ్యూరో / జులై 02, ప్రజా ప్రేరణ :

ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న లక్షలాది గ్రామీణ కార్మికులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. ఉపాధి హామీ కూలీల రోజువారీ వేతనాన్ని మరోసారి పెంచడంతో పాటు, ప్రస్తుతం అమలులో ఉన్న పని దినాలను కూడా పెంచాలని నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం గ్రామీణ ప్రాంతాల్లోని పేద, బలహీన వర్గాల కుటుంబాలకు అదనపు ఆర్థిక భరోసాను కల్పించనుంది. ఇప్పటి వరకు రోజుకు రూ.300గా ఉన్న ఉపాధి హామీ వేతనాన్ని ఇటీవల రూ.307కు పెంచిన కేంద్ర ప్రభుత్వం, తాజాగా మరోసారి సవరిస్తూ రోజువారీ కూలీని రూ.312గా నిర్ణయించింది. పెరిగిన వేతనాలు అమల్లోకి రావడంతో గ్రామీణ కార్మికులకు కొంత మేర ఆర్థిక ఉపశమనం లభించనుంది.అంతేకాకుండా, ప్రస్తుతం అమలులో ఉన్న 100 రోజుల ఉపాధి హామీ పనిదినాలను 125 రోజులకు పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. దీంతో గ్రామీణ కుటుంబాలకు అదనంగా 25 రోజుల ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ముఖ్యంగా వ్యవసాయ పనులు తగ్గే కాలంలో ఈ అదనపు పనిదినాలు గ్రామీణ కుటుంబాల జీవనోపాధికి దోహదం చేయనున్నాయని భావిస్తున్నారు.రాష్ట్రంలోని అనేక గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం వేలాది కుటుంబాలకు ప్రధాన ఆదాయ వనరుగా కొనసాగు తోంది. వర్షాభావ పరిస్థితులు, వ్యవసాయ సంక్షోభం, ఉపాధి అవకాశాల కొరత వంటి పరిస్థితుల్లో ఈ పథకం గ్రామీణ పేదలకు కీలక భరోసాగా నిలుస్తోందని నిపుణులు పేర్కొంటున్నారు.